సాక్షి
కర్నూలు
ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



రైతుకు వి'పత్తి'

వైరస్ సోకి లక్షల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతినింది. దిగుబడి పూర్తిగా తగ్గి పెట్టుబడులు కూడా రాని దుస్థితి నెలకొంది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

8లో▸



.. చదువుకునేదెట్టా!

మధ్యాహ్న భోజనం అరకొరగా పెడుతున్నారని, ఇలాగైతే పిల్లలు ఎలా చదవాలని, టీసీలు ఇవ్వాలని ఎంఈఓకు విద్యార్థుల తల్లిదండ్రులు వినతి పత్రం ఇచ్చారు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:79.798
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:50,122
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:45,772

న్యూస్‌రీల్

ఉద్యోగాల కోసం డబ్బులిచ్చి మోసపోవద్దు

● నిరుద్యోగ యువతకు ఎస్పీ విజ్ఞప్తి

కర్నూలు: ఉద్యోగాల కోసం ఎవరు కూడా డబ్బులిచ్చి మోసపోవద్దని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. పోటీ పరీక్షలు ప్రతిభ ఆధారంగానే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు వస్తాయన్న విషయాన్ని మరువరాదని శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మధ్యవర్తుల ద్వారా ఉద్యోగాలు వస్తాయన్నది కేవలం మోసపూరితమేనని పేర్కొన్నారు. దళారులు నిరుద్యోగుల్లో ఆశ కల్పించి నమ్మించి మోసాలకు పాల్పడుతున్నారని, మోసపోయిన బాధితులు న్యాయం చేయాలని కోరుతూ ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి క్యూ కడుతున్నారని తెలిపారు. డబ్బులిస్తే ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా ఆశ కల్పిస్తే స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలని తెలిపారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఐదుగురు డీడీఓలకు పోస్టింగ్స్

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ఎంపీడీఓలుగా విధులు నిర్వహిస్తున్న పలువురికి ఇటీవల పదోన్నతులు కల్పించారు. ఈ నేపథ్యంలో పదోన్నతులు పొందిన వారికి శనివారం పోస్టింగ్స్ ఇస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని గూడురు ఎంపీడీఓ అశ్వినీకుమార్‌ను ప్రకాశం జిల్లా డ్వామా డీవీఓగా, ఓర్వకల్ ఎంపీడీఓ ఎం.శ్రీనివాసులును నంద్యాల జిల్లా డ్వామా ఏపీఓ (అకౌంట్స్)గా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే అనంతపురం జిల్లా గోరంట్లలో విధులు నిర్వహిస్తున్న పి.నరేంద్రకుమార్‌ను నంద్యాల డ్వామా ఏపీడీగా, విడపనకల్‌లో విధులు నిర్వహిస్తున్న షకీలాబేగంను డ్వామా డీవీఓగా, గాండ్లపెంటలో విధులు నిర్వహిస్తున్న బి.వెంకటరాముడును ఆత్మకూరు డ్వామా ఏపీడీగా పోస్టింగ్ ఇచ్చారు. డీఆర్‌డీఏ పీడీగా విధులు నిర్వహిస్తున్న వైపీ రమణారెడ్డిని వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల డ్వామా ఏపీడీగా పోస్టింగ్ ఇచ్చారు.

ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక హోంగార్డుపై సస్పెన్షన్ వేటు

కర్నూలు (క్రైం): జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లు, ఒక హోంగార్డుపై జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సస్పెన్షన్ వేటు వేశారు. గత నెల 30న 'వీడియోలు తీసి.. నిలువునా దోచేసి' శీర్షికన దోపిడీ ముఠాతో పోలీసులు చెట్టాపట్టాలు వేసుకొని తిరుగుతున్న వైనాన్ని 'సాక్షి' ప్రముఖంగా ప్రచురించింది. ఈ నేపథ్యంలోనే ముగ్గురు పోలీసులపై వేటు పడటం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ శ్రీరాంప్రసాద్, తాలూకా పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ రాజేష్, ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న హోంగార్డు నబిషా క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడ్డారు. ఇటీవల నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో నమోదైన దోపిడీ కేసులో ముద్దాయిలు నాగేంద్ర, రమేష్, మాలిక్‌లను రిమాండ్‌కు తరలించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ముద్దాయిలు చేసిన నేరాన్ని తెలిసి కూడా పైఅధికారులకు తెలియజేయకుండా పై ముగ్గురు పోలీసు సిబ్బంది నిర్లక్ష్యం వహించారు. అలాగే జగన్నాథగట్టు రింగ్ రోడ్డు శివారులో ప్రేమజంటలను బెదిరించి దోపిడీకి పాల్పడిన ఘటనలో ముద్దాయిలకు ఈ కానిస్టేబుళ్లు కూడా సహకరించినట్లు చర్చ జరుగుతోంది. దీంతో పై ముగ్గురు పోలీసు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా విధుల నుంచి తప్పిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

అసంపూర్తిగా ఉన్న ఆదోని మెడికల్ కళాశాల భవనం



కల నిలిచిపోయి.. ప్రయివేటుకు బలైపోయి!

● ఆదోని మెడికల్ కాలేజీని ప్రైవేటుకు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వం
● గత ప్రభుత్వ హయాంలో రూ.500 కోట్ల అంచనాతో పనులు ప్రారంభం
● గతేడాదికి 80 శాతం నిర్మాణం పూర్తి
● నిర్మాణం పూర్తయ్యుంటే ఈ యేడాది నుంచే తరగతులు
● సీట్లు సైతం రాకుండా అడ్డుకున్న సర్కార్

వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థుల కలను రాష్ట్ర ప్రభుత్వం చెరిపేసింది. నిర్మాణం పూర్తయ్యే దశకు వచ్చిన ఆదోని మెడికల్ కాలేజీని ప్రైవేటుకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే అక్కడి వైద్యులను, సిబ్బందిని వెనక్కి రప్పించింది. కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేయలేక విద్యార్థులకు మెడికల్ సీట్లు రాకుండా అడ్డుకుంది.



వైద్యులు, సిబ్బంది వెనక్కి!

ఆదోనిలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణం గత యేడాదే పూర్తయ్యేది. కానీ ఎన్నికల పేరుతో కొన్ని నెలలు నిర్మాణం ఆగింది. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాలన్నీ ఆగిపోయాయి. ఇందులో భాగంగా ఆదోని మెడికల్ కాలేజీ చేరింది. వైద్యులు, ఉద్యోగ నియామకాలకు ఇచ్చిన నోటిఫికేషన్ కూడా ఆగిపోయింది. దీంతో ఎన్‌ఎంసీ నిబంధనల మేరకు తాత్కాలికంగా అక్కడ నియమించిన వైద్యులు, పారామెడికల్ సిబ్బందినీ కూటమి ప్రభుత్వం వెనక్కి రప్పించింది. వారిని ఇతర మెడికల్ కాలేజీల్లో సర్దుబాటు చేసింది.

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలోని ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక మెడికల్ కాలేజీ ఉండాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్ష్యం. అప్పట్లో ఒకేసారి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణాలను ప్రారంభించింది. ఒక్కో కళాశాలకు రూ.500కోట్ల వరకు కేటాయించి నిర్మాణాలు చేపట్టింది. ఇందులో ఐదు కాలేజీల నిర్మాణాలు పూర్తి కావడంతో పాటు ఒక్కో దాంట్లో 150 ఎంబీబీఎస్ సీట్లతో గత సంవత్సరం ప్రారంభానికి నోచుకున్నాయి. మిగిలిన కాలేజీల నిర్మాణం కూడా దాదాపుగా పూర్తి కావచ్చింది. ఇందులో ఆదోని మెడికల్ కాలేజీ కూడా ఉంది. ప్రస్తుతం దీని నిర్మాణం 80 శాతం వరకు పూర్తయ్యింది. మరో 20 శాతం శరవేగంగా పూర్తి చేసి ఉంటే ఈ యేడాది నుంచే 150 సీట్లతో కళాశాల ప్రారంభమయ్యేది. ఈ ప్రాంత వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండటంతో పాటు రోగులకు అందుబాటులోకి వచ్చేది. దీంతో పాటు ఈ రాష్ట్ర వైద్య విద్యార్థులు ఇతర రాష్ట్రాలు, దేశాలకు వెళ్లి వైద్యను అభ్యసించే అవసరం ఉండేది కాదు. ఆ ప్రాంత ప్రజలు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రావాల్సిన అవసరమూ అవసరం వచ్చేది కాదు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థుల వైద్య కల చెరిగిపోయింది. ప్రజలు మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.

మూడు గంటలు ప్రయాణించాల్సిందే!

ఆదోని డివిజన్‌లోని పలు మారుమూల ప్రాంతాలు, జిల్లా సరిహద్దు ప్రాంతాలైన హోళగుంద, కోసిగి, కౌతాళం, హాలహర్వి గ్రామాల నుంచి జిల్లా కేంద్రమైన కర్నూలుకు రావాలంటే మూడు గంటల సమయంపైనే పడుతుంది. ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే కర్నూలు వచ్చి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాలంటే వారి ప్రయాణానికే ఆరేడు గంటలు సమయం తీసుకుంటుంది. అంతేగాక కర్నూలు నగరం నుంచి కొన్ని ప్రాంతాలకు సాయంత్రమైతే బస్సులుండవు. ఇలాంటి పరిస్థితుల్లో ఆదోనిలో మెడికల్ కాలేజీ వస్తే ఆయా ప్రాంతాల ప్రజలందరికీ ఎంతో సౌలభ్యంగా ఉండేది. అక్కడి జనరల్ హాస్పిటల్‌లో కర్నూలులో మాదిరిగానే వైద్యం అందుకుని త్వరగా ఇళ్లకు చేరుకునే అవకాశం లభిస్తుంది. మెడికల్ కాలేజీ వస్తే వెనుకబడిన ఆ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం పశ్చిమ ప్రాంతంపై శీతకన్ను వేసింది. పూర్తి కావాల్సిన మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను ఆపేసింది. దీనిని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ప్రైవేటుకు అప్పగించేందుకు కేబినెట్‌లో కూడా ఆమోదముద్ర వేయించుకుంది. ప్రైవేటుకు ఇవ్వడంతో ఉచిత వైద్య విద్య, పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారనుంది. ప్రైవేటు వారు లాభం లేనిదే ఏ సంస్థనూ నిర్వహించరన్న విషయం తెలిసి కూడా ప్రభుత్వం వారికి ఇవ్వడం పట్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఆదోని మెడికల్ కాలేజీ భవనం నమూనా

ఆశలను నీరుగార్చిన ప్రభుత్వం

ఆదోని పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోజు ఇన్ పేషెంట్స్ 50 మంది దాక, ఔట్ పేషెంట్స్ 500 నుంచి 600 మంది దాక ఉంటారు. పేద, మధ్యతరగతి ప్రజల ఇబ్బందులను గుర్తించిన గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 58ఎకరాల్లో ఆదోని నుంచి ఎమ్మిగనూరు వెళ్లే రహదారిలో రూ.475 కోట్లతో కళాశాల నిర్మాణ పనులను ప్రారంభించారు. 430 పడకల ఆసుపత్రితో పాటు 100 మెడికల్ సీట్లతో కళాశాల పనులను పరుగులుపెట్టించారు. ఆదోని పట్టణంలోనే బైపీసీ విద్యను అభ్యసించే విద్యార్థులు 400 మంది దాక ఉంటారు. అందులో 150 మంది పైబడి నీట్ పరీక్షలకు హాజరవుతున్నారు. పదుల సంఖ్యలో మెడికల్ సీట్లను సాధిస్తున్నారు. ఒక్క ఆదోని నియోజకవర్గంలోనే ఇంత మంది ఉంటే డివిజన్ ప్రాంతంలో ఈ సంఖ్య వందలకు చేరుకుంటుంది. కళాశాల ప్రారంభమైతే స్థానికంగానే సీటు దొరుకుతుందనుకున్న విద్యార్థుల ఆశలను కూటమి సర్కారు నీరుగార్చింది.

న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం



వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడం దుర్మార్గం. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. రోగుల వద్ద ఫీజు పేరుతో దోపిడీ చేసేందుకే వీటిని ప్రైవేటు పరం చేశారు. టీడీపీ నేతలు వారి అనుయాయులతో లోపాయికారీ ఒప్పందం పెట్టుకొని వైద్య కళాశాలలన్నీ అప్పగిస్తున్నారు. ప్రైవేటు వైద్య కళాశాలలుగా కొనసాగించడాన్ని అడ్డుకుంటాం. న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం. మా ప్రభుత్వంలో వీటిని తిరిగి స్వాధీనం చేసుకుంటాం.

– ఎస్వీ మోహన్ రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు

ఉచిత వైద్యం అందని ద్రాక్ష



సీఎం చంద్రబాబునాయుడు అధికారంలో ఉంటే ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేటుపరం చేయడం ఆనవాయితీగా మారింది. ఇప్పుడు ఆదోని మెడికల్ కాలేజీ వంతు వచ్చింది. దీంతో ఆ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్యం, ఉచిత వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుంది. వెనుకబడిన ఈ ప్రాంతంలో ప్రభుత్వమే మెడికల్ కాలేజీ నిర్వహించాలి.

–డాక్టర్ జి. గౌస్‌దేశాయ్, సీపీఎం జిల్లా కార్యదర్శి

ప్రభుత్వమే నిర్వహించాలి



ఆదోని మెడికల్ కాలేజీని ప్రైవేటుకు పీపీపీ విధానంలో అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం చూడటం దుర్మార్గం. దీనివల్ల పేదలకు వైద్య విద్య, ఉచిత వైద్యం దూరం అవుతుంది. ప్రైవేటుకు ఇస్తే వారు సేవా దృక్పథంతో ఎందుకు పనిచేస్తారు. ప్రభుత్వమే దీనిని నిర్వహించాలి.

-కె.శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి, కర్నూలు

పోలీసు శాఖకు నూతన 'హంటర్'

● పేలుడు పదార్థాలను గుర్తించడంలో దిట్ట అయిన జాగిలం

కర్నూలు: కేసుల ఛేదన, నేరస్తులను గుర్తించడంలో జిల్లా పోలీసు శాఖ మరింత బలోపేతమయ్యేందుకు ప్రభుత్వం నూతన జాగిలాన్ని పంపింది. మంగళగిరి పోలీస్ హెడ్ క్వాటర్స్ ఆరో బెటాలియన్‌లో పది నెలల పాటు పేలుడు పదార్థాలపై ఈ కొత్త డాగ్ హంటర్ శిక్షణ పొంది శనివారం జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుంది. ఇప్పటివరకు పోలీసు శాఖలో 8 జాగిలాలు ఉండగా హంటర్ రాకతో ఆ సంఖ్య తొమ్మిదికి చేరింది. ఇది బెల్జియం మలనాయిస్ జాతికి చెందినది. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ నూతన జాగిలాన్ని పరిశీలించారు. వాటి సంరక్షణపై డాగ్ స్క్వాడ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేసుల ఛేదనలో జాగిలాలు కీలకపాత్ర పోషిస్తున్నందున వాటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. డాగ్ స్క్వాడ్ మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వాటి సంరక్షణ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ జావెద్, డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఏఆర్ కానిస్టేబుల్ రాజు, డాగ్ హ్యాండ్లర్ ఏఆర్ కానిస్టేబుల్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



డాగ్ హంటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

రైతు ఆత్మహత్యలు ప్రభుత్వానికి కనిపించడం లేదా?

● యూరియా అందించని దీన స్థితిలో ఉన్నారా?
● రైతులకు బాసటగా 9న అన్నదాత పోరు
● వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్వీ మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

కర్నూలు (టౌన్): పంటలు పండక, పండించిన పంటలకు గిట్టు బాటు ధర లేక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నా రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. రైతులకు బాసటగా ఈనెల 9వ తేదీ మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆర్డీఓ కార్యాలయాల వద్ద అన్నదాత పోరుపేరుతో నిరసన కార్యక్రమాలు చేపడతామని, అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామని చెప్పారు. కర్నూలులోని ఎస్వీ కాంప్లెక్స్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ..రెండు నెలలుగా యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. జిల్లాలో రైతులు ఆందోళనలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదని విమర్శించారు.

జగనన్న హయాంలో రైతులు ఎప్పుడైనా రోడ్డు మీదకి వచ్చారా?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎప్పుడైనా రైతులు రోడ్ల మీదకు వచ్చారా అని ఎస్వీ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. ధరల స్థిరీకరణకు రూ. 3 వేల కోట్ల నిధి ఉంచారని, కోవిడ్ సమయంలోను చీనీ, పత్తి రైతులను ఆదుకున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి... క్యాలెండర్ ప్రకారం ఐదేళ్ల రైతు సంక్షేమాన్ని అమలు చేశారన్నారు. రైతులను ఆదుకోవడం చేత కాక కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. రాష్ట్రంలో పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మామిడి, చీనీ, ఉల్లి, పత్తి, టమాటా, మిర్చి, రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, బీసీ సెల్ అధ్యక్షుడు రాఘవేంద్ర నాయుడు, యువజన విభాగం అధ్యక్షులు శివారెడ్డి, పాటిల్ తిరుమలేశ్వర రెడ్డి, పాటిల్ హనుమంత రెడ్డి, కిషన్ కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, రాజేశ్వరరెడ్డి, షాషావలీ పాల్గొన్నారు.

రూ. కోట్ల దోపిడీ?

రాష్ట్రానికి 6 నుంచి 7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా వస్తే ఎక్కడికి పోయిందని ఎస్వీ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం మార్క్‌ఫెడ్‌లకు, 50 శాతం ప్రైవేటు డీలర్లకు యూరియా అందించాల్సి ఉందన్నారు. యూరియా మొత్తం ప్రైవేటు డీలర్లకు అందించి టీడీపీ నేతలు రూ. కోట్లు దోపిడీ చేశారన్నారు. యూరియా బస్తా ధర రూ. 270 నుంచి రూ. 450కు పెంచి టీడీపీ నేతలు అమ్ముకుంటున్నా విజిలెన్స్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

పల్లెకు పోదాం.. సమస్యలు పరిష్కరిద్దాం

● జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా

కల్లూరు: గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించేందుకే పల్లెకు పోదాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా తెలిపారు. కల్లూరు మండలం పర్ల గ్రామంలో శనివారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఓహెచ్‌ఎస్ఆర్, అంగన్‌వాడీ కేంద్రం, ఆస్పత్రి, గ్రామ సచివాలయం, సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో సీసీ రోడ్లు వేయాలని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంపౌండ్ వాల్ నిర్మించాలని, కిచెన్ షెడ్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పర్ల నుంచి సింగవరం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై ఉన్న కల్వర్టు బ్రిడ్జి నిర్మించాలని అధికారులకు సూచించారు. సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలుర వసతి గృహంలో నిర్మాణంలో ఆగిపోయిన భవనాలను పూర్తి చేస్తామన్నారు. బాగా చదువుకుని మంచి పేరు తెచ్చుకోవాలని పదో తరగతి విద్యార్థులకు సూచించారు. ఓవర్‌హెడ్ స్టోరేజ్ ట్యాంక్‌ను ప్రతి రోజు క్లోరినేషన్ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఆదేశించారు. క్లోరినేషన్ పరీక్షలకు గడువు తీరిన కిట్లను ఎందుకు వినియోగిస్తురాని ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, వివరణ కోరాలని ఎంపీడీఓను ఆదేశించారు. పత్తి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా



అనంత పద్మనాభస్వామి సేవలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



వేడుకను తిలకిస్తున్న భక్తులు

వైభవంగా అనంత చతుర్థి వేడుకలు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో అనంత చతుర్దశి వేడుకలు వైభవంగా జరిగాయి. శనివారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో పూజా మందిరంలో విశేషంగా పూజలు చేపట్టారు. స్వర్ణ మండపంలో అనంత పద్మనాభ స్వామిని కొలువుంచి వేద ఘోష శాస్త్రోక్తంగా నిర్వహించారు. అభిషేకాది పుష్పార్చనలతో ఎంతో శోభాయమానంగా వేడుక చేపట్టారు. అలాగే శుక్ర, ఆది వారాలు సెలవులు కలిసిరావడంతో శ్రీమఠంలో భక్తుల రద్దీ నెలకొంది. భక్తుల దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. తుంగాతీరం, మధ్వకారిడార్, అన్నపూర్ణ భోజనశాలతో భక్తుల కోలాహలం నెలకొంది.

జీఎన్‌ఎం కోర్సులకు నోటిఫికేషన్

కర్నూలు(హాస్పిటల్): జీఎన్ఎం(జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరి) కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సులో చేరాల్సిన వారు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హతలు, వయోపరిమితి, దరఖాస్తు విధానం, సీట్ల లభ్యత వంటి వివరాలు నోటిఫికేషన్‌లో ఉంటాయన్నారు. దరఖాస్తులను ఈ నెల 22వ తేది వరకు ప్రభుత్వ ఆసుపత్రిలోని కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారన్నారు.

వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ రాష్ట్ర కార్యదర్శుల నియామకం

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్ల మెంటరీ రాష్ట్ర కార్యదర్శులను నియమించింది. నియమితులైన వీరు పార్టీ కేంద్ర కార్యాలయం తో సమన్వయం చేసుకుంటూ సంబంధిత రీజ నల్ కోఆర్డినేటర్లు, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరిం చాలని పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపింది.

కర్నూలు జిల్లాలో..

పార్లమెంటరీ రాష్ట్ర కార్యదర్శులుగా తెర్నెకల్ సురేందర్‌రెడ్డి, ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, మొలగవల్లి మహేంద్రనాథ్ రెడ్డిని నియమిం చారు. ఎమ్మిగనూరు, పత్తికొండ అసెంబ్లీ నియో జకవర్గాలను తెర్నెకల్ సురేందర్‌రెడ్డి , మంత్రాల యం, ఆదోని అసెంబ్లీ నియోజకవర్గాలను ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, కళ్యాణదుర్గం, పాణ్యం సెంబ్లీ నియోజకవర్గాలను మొలగవల్లి మహేంద్రనాథ్ రెడ్డి పర్యవేక్షణ చేయాల్సి ఉంది.

నంద్యాల జిల్లాలో

పార్లమెంటరీ రాష్ట్ర కార్యదర్శులుగా గుండం సూర్యప్రకాష్ రెడ్డి, కర్రా హర్షవర్ధన్ రెడ్డిని నియ మించారు. శ్రీశైలం, ఆలూరు అసెంబ్లీ నియో జకవర్గాలను గుండం సూర్యప్రకాష్ రెడ్డి , కర్నూలు, కోడుమూరు అసెంబ్లీ నియోజకవ ర్గాలను కర్రా హర్షవర్ధన్ రెడ్డి పర్యవేక్షణ చేయాల్సి ఉంది.

నేడు 'కవితా (వి) హారం' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ప్రముఖ రచయిత కేపీఆర్ శర్మ రచించిన 'కవితా (వి) హారం' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు వీఆర్ కాలనీలోని సాయి రాఘవ రెసిడెన్సీలో జరు గుతుందని నిర్వాహకులు తెలిపారు. తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ డాక్టర్ రాధాశ్రీ, విశ్రాం త ఆర్ఐఓ రంగనాథ శర్మ, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ కల్యాణ శాస్త్రి అతిథులుగా హాజరు కాను న్నారని పేర్కొన్నారు. రచయిత్రి డాక్టర్ కర్నాటి చం ద్రమౌళిని పుస్తక సమీక్ష చేస్తారని తెలిపారు.

రైతుకు వి'పత్తి'

- వైరస్ సోకి ఎండిపోతున్న పత్తి పొలాలు
- లక్షల ఎకరాల్లో దెబ్బతిన్న పంట
- పూర్తిగా తగ్గనున్న దిగుబడి
- పెట్టుబడులు కూడా రాని దుస్థితి



బాపనదొడ్డి సమీపంలో వైరస్ సోకిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కృష్ణగిరి: కొన్ని రోజులు వర్షాలు లేకపోవడం.. ఉన్న ట్టుండి వానలు భారీగా పడటంతో పత్తి పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వైరస్ సోకి ఎర్రగా మారాయి. లక్షల ఎకరాల్లో పంట దెబ్బతినింది. దిగుబడి పూర్తిగా తగ్గి పెట్టుబడులు కూడా రాని దుస్థితి నెలకొంది. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 4.22 లక్షల హెక్టార్లు ఉండగా.. అత్యధికంగా 2,19,636 హెక్టార్లలో పత్తి సాగైంది.

పంటంతా ఎర్రగా మారి..

గతేడాది వేరుశనగ సాగు చేయగా దిగుబడులు అం తంత మాత్రంగా వచ్చాయి. దీంతో ఈ యేడాది రైతులు అధికంగా పత్తి వైపు మొగ్గు చూపారు. మే నెల చివరల్లో కురిసిన వర్షాలకు చాలా మంది విత్తనం వేశారు. అలాగే జూన్ నెలలో కూడా లక్షల ఎకారాల్లో పత్తి సాగు చేశారు. ఆశించిన మేర వర్షాలు పడటంతో పంట ఏపుగా వచ్చి కాయలు వచ్చాయి. అయితే జూలై నెలంతా బెట్ట రావడంతో పంట ఎం డుపోయే దుస్థితికి వచ్చింది. ఈ సమయంలో ఆగస్టు నెలలో ఒక్కసారిగా భారీ వర్షాలు రావడంతో ఏపుగా వచ్చినట్లు వచ్చిన పత్తి పంటకు వైరస్ సోకింది. పం టంతా క్షణాల్లోనే ఎర్రగా మారింది.



రామకృష్ణాపురం సమీపంలో వైరస్ సోకి ఎండిపోతున్న పత్తి పంట

పెట్టుబడి మట్టిపాలు

ఇంటికి తెల్లబంగారం(పత్తి) వస్తుందని ఆశించిన రైతులకు కన్నీరే మిగిలింది. అధిక వర్షాలతో జిల్లా వ్యాప్తంగా లక్షల ఎకరాల్లో పత్తి దెబ్బతినడంతో కోట్ల రూపాయల పెట్టుబడి మట్టిపాలైంది. విత్త నాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, సేద్యపు తదితర వాటి కింద ఎకరాకు రూ. 40వేల వరకు ఖర్చు చేశారు. ఎర్ర, నల్లరేగడి భూముల్లో సాగు చేసిన పత్తి పంట కాయ దశకు వచ్చే సమయానికి వైరస్ సోకింది. పంట ఎర్రగా మారి ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా అందని స్థితిలో ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది కూడా ఇదే తెగులు రావ డంతో కనీస దిగుబడి కూడా అందలేదని, రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



గతేడాది పొగాకు సాగు చేశాం. మంచి దిగుబడి వచ్చినా మద్దతు ధర లేక చాలా నష్టపోయా. ఈ ఏడాది నాకున్న ఎనిమిది ఎకరాల్లో పత్తి సాగుచేశా. కాయదశకు వచ్చే సరికి వర్షాలు అధికంగా రావడం తో తేమ అధికమై పంటకు వైరస్ సోకి ఎర్రగా మారింది. ఎకరాకు రూ. 40వేల ప్రకారం రూ.3 లక్షల పెట్టుబడులు పెట్టా. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి. రైతులకు పరి హారం అందించి ఆదుకోవాలి. –బజారి, పత్తి రైతు, ఎస్‌హెచ్ ఎర్రగుడి

పెట్టుబడులు కూడా రావు



నాకున్న 15 ఎకరాల్లో పత్తి సాగుచేశా. పంట వస్తే అప్పులు కట్టుకోవచ్చని ఆశ పడ్డాను. భారీ వర్షాలతో 8 ఎకరాల పొలానికి వైరస్ వచ్చి పంట ఎర్రగా మారడం ప్రారంభించింది. దీని నివార ణకు మందులు వాడినా ఫలితం లేకుండా పోయిం ది. చెట్టుకు ఉన్న నాలుగైదు కాయలు మాత్రమే చేతికి వచ్చేలా కనపడు తోంది. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. పత్తి రైతును ప్రభు త్వం ఆదుకోవాలి. –నాగేశ్వరరావు, పత్తి రైతు, రామకృష్ణాపురం

అధిక తేమతోనే వైరస్



వరుసగా 15రోజులు వర్షాలు వచ్చి అధిక తేమ పొలంలో ఉండటంతో పత్తిని వైరస్ ఆశించింది. ఇది బాక్టీరియల్ బ్లైట్. దీనిని కోణీయ ఆకు మచ్చ తెగులు అని కూడా పిలు స్తారు. వైరస్ సోకిన పత్తి చెట్ల అవశేషాలను నాశనం చేస్తే దీన్ని నివారించవచ్చు. ఆమ్ల–డిలింట్ చేసిన విత్తనాలు వాడి, సరైన నీటిపారుదల పద్ధతులు నిర్వహిస్తే ఈ వైరస్ రాదు. – మహేంద్ర, ఏఓ, కృష్ణగిరి

నేడు సంపూర్ణ చంద్ర గ్రహణం

- మూతపడనున్న దేవాలయాలు

కర్నూలు కల్చరల్: భాద్రపద శుక్ల పౌర్ణమి ఆదివారం రాహుగ్రస్త సంపూర్ణ చంద్ర గ్రహణం రానుంది. ఈ గ్రహణం భారత దేశం అంతటా కనిపిస్తుందని పండి తులు చెబుతున్నారు. ఆదివారం రాత్రి 9.56 గంటలకు గ్రహణం ప్రారంభమవుతుందని, 10.59 గంటలకు గ్రహణ మధ్యకాలమని, రాత్రి 1.26 గంటలకు గ్రహణ మోక్షకాలం ఉంటుందని తెలిపారు. మొత్తం 3.30 గం టల పాటు గ్రహణ పుణ్య కాలం ఉండనుందని చెప్పారు. ఇదిలా ఉండగా చంద్ర గ్రహణ నేపథ్యంలో జిల్లాలోని దేవాలయాలు ఆదివారం మూసి వేయను న్నారు. సోమవారం ఆలయాలను తెరచి శుద్ధి అనం తరం నిత్య పూజలతో యథాతథంగా దర్శనాలు కల్పిం చనున్నారు.

11న కళా ఉత్సవ్ పోటీలు

కర్నూలు(సిటీ): ఈనెల 11వ తేదీన బి.తాండ్రపాడులోని డైట్ కళాశాలలో సంగీతం, నృత్యం, నటన, చిత్రకళ తదితర 11 అంశాలపై జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ అయూబ్ హుసేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలుకు జిల్లాకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు, ఎయి డెడ్, కేంద్రీయ విద్యాలయ, నవోదయ, రెసిడెన్షియల్, ఇతర మేనేజ్‌మెంట్ స్కూళ్లలో 9,10,11,12 తరగతులు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన వచ్చునన్నారు. వివరాలకు కళాశాల అధ్యాపకులు బి.మధు 8801761409 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు ఉల్లి వేలం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు రూ.1200 ధరతో కొనుగోలు చేసిన ఉల్లిని ఆదివారం వేలం వేయాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. మూడు రోజుల్లో 10 వేల క్వింటాళ్లకుపైగా మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిం ది. వీటిని మార్కెట్ యార్డులోనే గోదాములో నిల్వ చేసింది. మార్కెట్‌లో తక్కువ ధరతో ఉల్లి లభిస్తుండటం తో ప్రభుత్వం రైతుబజార్లకు తరలిస్తున్న ఉల్లిని కొనేం దుకు వినియోగదారులు ముందుకు రావడం లేదు. చౌక ధరల దుకాణాల ద్వారా కిలో రూ.14 ప్రకారం పంపిణీ చేస్తామన్నా ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో మూడు రోజుల్లో కొనుగోలు చేసిన 1000 టన్నుల ఉల్లిని ఈ నెల 7వ తేదీ మార్కెట్ యార్డులోనే వేలం వేయనున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గద్వాల రాజు తెలిపారు. హోటల్ యజమానులు, వ్యాపారులు వేలం పాటలో పాల్గొన వచ్చని పేర్కొన్నారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

మహానంది: తమ్మడపల్లె గ్రామంలో ఓ విద్యార్థి ఆత్మహ త్యకు పాల్పడ్డాడు. అనంతపురం జిల్లా తాడిపత్రి సమీ పంలోని కోనాపురం గ్రామానికి చెందిన కార్తీక్‌రెడ్డి(21) తమ్మడపల్లెలోని తన బంధువుల వద్ద ఉంటూ నంద్యాల పట్టణంలోని ఓ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువు తున్నాడు. కాగా గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కార్తీక్‌రెడ్డి కడుపునొప్పి భరించలేక ఆత్మ హత్యకు శనివారం ఉరేసుకుని పాల్పడ్డాడు. తల్లి, కుటుంబ సభ్యులు తమకు ఎలాంటి అనుమానాలు లేవ ని, కేసు వద్దని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్ మృతి

- మరో ముగ్గురికి గాయాలు



వాహనంలో ఇరుక్కపోయి మృతి చెందిన క్లీనర్ కురువ కుమార్ పీటర్

శిరివెళ్ల: ఆళ్లగడ్డ– నంద్యాల జాతీయ రహదారిపై గోవిందపల్లె– కాండ్ల పల్లె మధ్య కార్తికేయ గోడౌన్ వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐచర్ వాహన క్లీనర్ మృతి చెందాడు. ఆళ్లగడ్డ నుంచి నంద్యాల వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ మద్యం మత్తులో సడన్‌గా నిలపడంతో అదే సమ యంలో వెనుక వస్తున్న ఐచర్ వాహనం వేగంగా వచ్చి ఢీ కొనింది. ఈ ప్రమాదంలో ఐచర్ వాహనం లో ఉన్న క్లీనర్ మహానంది మండలం బొల్లారానికి చెందిన కురువ కుమార్ పీటర్ (42)తీవ్రంగా గాయపడి ఇరుక్కపోయి అక్కడికక్కడే మృతి చెం దాడు. అదే గ్రామానికి చెందిన బాలాంజనేయులు, రాజోలి మల్లి, మహమ్మద్ బాషాలకు గాయాల య్యాయి. చికిత్స నిమిత్తంగా నంద్యాల ప్రభు త్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇరు వురు సంతానం ఉన్నారు. మృతుని భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ చిన్న పీరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆందోళన బాటలో 104 ఉద్యోగులు

కర్నూలు (హాస్పిటల్): సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9వ తేదీ వరకు వివిధ రూపాల్లో ఆందోళన చేయనున్నట్లు 104 అంబులెన్స్ ఉద్యోగులు చెప్పారు. ఈ మేరకు శనివారం సాయంత్రం డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన యాజ మాన్యం భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ వారు గతం నుంచి పనిచేస్తున్న ఉద్యోగులందరికీ వేత నాలను తగ్గించిందన్నారు. దీనిపై వివరణ అడుగగా మూడు నెలల నుంచి సరైన సమాధానం ఇవ్వడం లేదని, యాజమాన్యాన్ని కలవనివ్వటం లేదన్నారు. తమ సమస్యలపై రాష్ట్ర ఉన్నతాధికారులకు అనేక విన తిపత్రాలు ఇచ్చినా ఎలాంటి స్పందన లేదన్నారు. దీం తో 9వ తేదీ వరకు వివిధ రూపాల్లో ఆందోళన చేస్తామని, అప్పటికీ పరిష్కారం కాకపోతే మరింత ఉధృతం చేస్తామన్నారు. తగ్గించిన జీతాలు బకాయి లతో సహా ఇవ్వాలని, ఉద్యోగులందరికీ వేతనాలు పెంచాలని, పూర్వ సంస్థ బకాయిలను చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, డేటా ఎంట్రీ ఆప రేటర్లకు ఔట్ సోర్సింగ్ జీతాలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేశా మన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కళ్యాణి, ఇలి యాస్, హసన్, షరీఫ్, మంజుల, వినోద్, మల్లి కార్జున, మధు, అజం ఉన్నారు.



డీఎంహెచ్ఓకు వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

కారు బోల్తా

బేతంచెర్ల: హెచ్ కొట్టాల గ్రామ సమీపంలో శనివారం జాతీయ రహదారిపై వెళ్తున్న కారు బోల్తా పడింది. కర్నూలు మండలం పందిపాడు గ్రామస్తులు మద్ది లేటయ్య క్షేత్రానికి కారులో వెళ్లి తిరిగి వస్తుండగా హెచ్ కొట్టాల గ్రామ సమీపాన ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఒక్కరికి మాత్రమే స్వల్ప గాయాలు కాగా మరో ఆరుగురు క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపి రిపీల్చుకున్నారు.



బోల్తా పడిన కారును పరిశీలిస్తున్న స్థానికులు

ఖాళీ కడుపుతో చదువుకునేదెట్లా!

- మధ్యాహ్న భోజన ఏజెన్సీనైనా మార్చండి.. టీసీలైనా ఇవ్వండి
- కొమ్మూరు కొట్టాల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల మొర

బేతంచెర్ల: మధ్యాహ్న భోజనం అరకొరగా పెడు తున్న బడిలో తమ పిల్లలు చదువుకోలేరని, టీసీలు ఇస్తే ఏదైనా బడిలో చేర్పిస్తామని కొమ్మూరు కొట్టాల ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదం డ్రులు మొర పెట్టుకుంటున్నారు. ఏజెన్సీని మార్చాలని మొరపెట్టుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ శనివారం వారు ఎం ఈఓ సోమశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. భోజన ఏజెన్సీకి సంబంధించి విద్యార్థుల తల్లిదం డ్రులు సూచించిన వారిని కాకుండా అధికార పార్టీ నాయకులు తమకు నచ్చిన వారిని ఎక్కించుకొని రాజకీయం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించ కుండా గతంలో ఉన్న నాగలక్ష్మమ్మను తొలగించి ఆమె స్థానంలో కొమ్ము మహాలక్ష్మికి ఏజెన్సీని కట్టబె ట్టారన్నారు. ఆ ఏజెన్సీ వాళ్లు విద్యార్థులకు సరిగా అన్నం పెట్టకపోవడంతో అర్ధాకలితో చదువుకోలేక ఈ పాఠశాలలో 35 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం ఐదుగురు మాత్రమే బడికెళ్తున్నారు.



ఎంఈఓ సోమశేఖర్‌కు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థుల తల్లి దండ్రులు

దాదాపు రెండు నెలలుగా విద్యార్థులు పాఠశాలకు వెళ్లకున్నా పట్టించుకునేవారు లేరు. జిల్లా కలెక్టర్, డీఈఓకు ఫిర్యాదు చేసినప్పటికీ రాజకీయ నాయ కుల ఒత్తిళ్లతో సమస్య పరిష్కారం కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతు న్నారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజనం నిర్వహణపై ఓ వర్గం పెత్తనం చెలాయిస్తోందని, అయితే ఆ వర్గం పిల్లలను మాత్రం ఈ బడికి పంపడం లేదనే గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వారి మాట వినక పోతే కేసులు పెట్టిస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఈ విషయంపై ఎంఈఓ సోమశేఖర్‌ను వివరణ కోరగా అందరూ కాకుండా విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు సంబంధించి దరఖాస్తు చేసుకుంటే.. టీసీల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీసులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారు

మధ్యాహ్న భోజనం అరకొరగా పెడుతున్నారని పిల్లలు ఇంటికి వచ్చి చెబుతున్నారు. మధ్యాహ్న భోజనం చూడటానికి తల్లిదండ్రులను పాఠశాల వద్దకు రానీయడం లేదు. మేము వెళ్లి చూడాలంటే పోలీసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మా పిల్లలను ఏవిధంగా స్కూలుకు పంపించాలి. 30 మంది పిల్లలకు టీసీలు ఇస్తే వేరే పాఠశాలలో చేర్పించుకుంటాం. – మద్దిలేటి

జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి

మా పిల్లలకు మధ్యాహ్న భోజనం సక్రమంగా పెట్టడం లేదని ఫిర్యాదు చేస్తే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీనికి తోడు అధికార పార్టీ నాయకులు చెప్పినట్లుగా అధికారులు వ్యవహ రిస్తు న్నారు. మెజార్టీగా ఉన్న తల్లిదండ్రుల విన్నపాన్ని పట్టించుకోవడం లేదు. మా పిల్లలు సక్రమంగా పాఠశాలకు వెళ్లడం లేదు. జిల్లా అధికారులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలి. – మదన గోపాలు, విద్యార్థి తండ్రి